ఆంధ్రజ్యోతి

పెద్దపల్లి జిల్లా వార్తలు
5★
సోమవారం 15 జనవరి 2024

వైభవంగా గోదారంగనాథుల కల్యాణోత్సవం 8లో..

వార్షిక లక్ష్యాలను సాధించేలా శ్రమించాలి 8లో..



చిగురిస్తున్న ఆశలు

- ధరలకు అనుగుణంగా పెరగని మెనూ చార్జీలు
- మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల ఇక్కట్లు
- గౌరవ వేతనం పెంపునకు కాంగ్రెస్ పార్టీ హామీ

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న మహిళల్లో గౌరవ వేతనం పెంపుపై ఆశలు చిగురిస్తున్నాయి. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న గౌరవ వేతనం వారికి ఏమాత్రం సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. తాము అధికారంలోకి వస్తే గౌరవ వేతనం రూ.10వేలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. పథకాన్ని ప్రారంభించినప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వం ఒక్క రూపాయి పెంచకపోగా, అనేక పోరాటాల ఫలితంగా గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి నుంచి 3 వేలకు పెంచింది. పెంచిన గౌరవ వేతనాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2022 ఏప్రిల్ నుంచి అమల్లోకి తీసుకవస్తామని హామీ ఇచ్చినప్పటికీ, గత ఏడాది జూలై మాసం నుంచి ఇస్తున్నది. కేంద్ర రూ. 1000, రాష్ట్ర ప్రభుత్వం రూ. 2వేలు కలిపి మొత్తం రూ. 3వేలు ఇస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఇచ్చే గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చింది. అంతేగాకుండా మేనిఫెస్టోలో పెట్టింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సీట్లు సాధించి అధికారంలోకి రావడంతో నిర్వాహకుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి.

● ఇరవై మూడేళ్లుగా సేవలు..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థిని, విద్యార్థులు అత్యధిక మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే కావడం గమనార్హం. వారికి సరైన పోషకాహార తిండి లేక చాలా మంది పాఠశాలలకు రావడం లేదు. ఈ పరిస్థితిని గమనించిన అప్పటి కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఉన్న రాష్ట్రాల్లోని కొన్ని పాఠశాలల్లో 1995 ఆగస్టు 15వ తేదీ నుంచి మధ్యాహ్న భోజన పథకాన్ని అమల్లోకి తీసుకవచ్చింది. ఆ తర్వాత 2001 నవంబరు 28 నుంచి అన్ని పాఠశాలల్లో పథకాన్ని అమల్లోకి తీసుకవచ్చారు. మొదట ఈ పథకాన్ని ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే అమలు చేయగా, 2007 అక్టోబరు నుంచి 8వ తరగతి వరకు చదివే విద్యార్థులకు కూడా వర్తింపజేశారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొన్ని రోజులకు 9,10 తరగతులు చదివే విద్యార్థులకు కూడా పథకాన్ని అమలు చేశారు. 1 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకానికి అయ్యే ఖర్చులో కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం బడ్జెట్ కేటాయిస్తున్నది. 9,10 తరగతులు చదివే విద్యార్థులకు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే ఖర్చును భరిస్తున్నది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకాన్ని 27,909 పాఠశాలల్లో చదువుతున్న సుమారు 26 లక్షల మంది విద్యార్థులకు అమలు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దొడ్డు బియ్యానికి బదులు సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నది. దీంతో విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వస్తూ భోజనాన్ని తింటున్నారు. పాఠశాలల్లో ఈ పథకాన్ని అమలుచేసే బాధ్యతను స్వశక్తి మహిళా సంఘాలకు అప్పగించింది. ఇద్దరు, ముగ్గురు మహిళలు కలిసి భోజనాలను సిద్ధం చేసి వడ్డిస్తున్నారు.

● మెనూ చార్జీలు అంతంత మాత్రమే..

మధ్యాహ్న భోజన పథకం అమలు కోసం నిత్యావసర సరుకుల మెనూ చార్జీలు కూడా అంతంత మాత్రంగానే ఇస్తున్నారు. ప్రభుత్వం బియ్యం మాత్రమే సరఫరా చేస్తోంది. నిర్వాహకులు మెనూ ప్రకారం చేసే వంటలకు తరగతుల వారీగా బిల్లులు చెల్లిస్తున్నది. 1 నుంచి 5వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ. 5.45 చొప్పున, 6 నుంచి 8వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ. 8.17, తొమిది, పదవ తరగతి చదివే విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10.67 చొప్పున చెల్లిస్తున్నారు. అలాగే వారానికి మూడుసార్లు ఉడకబెట్టిన కోడిగుడ్లను విద్యార్థులకు పెట్టాల్సి ఉంటుంది. వీటికి ఒక్కో గుడ్డుకు రూ.5 మాత్రమే చెల్లిస్తున్నది. వాస్తవానికి బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం ఒక గుడ్డు ధర రూ.6.50 నుంచి రూ.7 పలుకుతున్నది. రోజురోజుకు నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు పెరుగుతుండడంతో ప్రభుత్వం ఇస్తున్న బిల్లులు ఏమాత్రం సరిపోవడం లేదని మహిళలు చెబుతున్నారు. ఈ పథకాన్ని అమలుచేస్తున్న ఒక్కో వర్కర్‌కు కేంద్ర ప్రభుత్వం నెలకు రూ.1000 చెల్లిస్తున్నది. 23 ఏళ్లు గడుస్తున్నా కూడా అంతే గౌరవ వేతనాన్ని కేంద్రం ఇస్తున్నదని, ఒక్కరూపాయి కూడా పెంచలేదని నిర్వాహకులు చెబుతున్నారు. పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది జూలై నుంచి అదనంగా రూ.2వేలు ఇస్తున్నది. అయినా కూడా ఈ గౌరవ వేతనం,నిత్యావసరాలు, వంట గ్యాస్, కోడిగుడ్లకు ఇచ్చే డబ్బులు సరిపోవడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 10 గంటలకు వంట చేసేందుకు పాఠశాలలకు వెళితే ఇంటికి తిరిగి వచ్చేసరికి మధ్యాహ్నం 3 అవుతుందని, ఆ తర్వాత వేరే ఏ పనిచేసే పరిస్థితి లేదన్నారు. బయట కూలీకి పోతే రోజుకు రూ.300 ఇస్తుండగా, ఉపాధిహామీ కూలీకి వెళ్లినా రూ.200కు తక్కువ రావని నిర్వాహకులు చెబుతున్నారు. ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.10వేల గౌరవ వేతనాన్ని వెంటనే అమల్లోకి తీసుకరావాలని, ఉచితంగా కోడిగుడ్లు, వంట సామగ్రిని, వంట గ్యాస్‌ను సరఫరా చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

మల్లన్న ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు

- చైర్మన్ మేకల మల్లేశం


కోనేరును పరిశీలిస్తున్న ధర్మకర్తల మండలి సభ్యులు

ఓదెల, జనవరి 14 : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మల్లన్న క్షేత్రం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ మేకల మల్లేశం అన్నారు. ఆదివారం మల్లన్న ఆలయంలో ధర్మకర్తల మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు స్నానపు గదుల ఏర్పాట్లు, ఆలయ ప్రాంగణంలో సులబ్ కాంప్లెక్స్ ఏర్పాటు కోసం సమీక్షించారు. అలాగే ఆలయ అర్ధ మండప నిర్మాణం, మండపం మరమ్మతులు చేపట్టనున్నట్లు చైర్మన్ తెలిపారు. అనంతరం ఆలయ పరిసరాల్లో ధర్మకర్తల బృందం నూతనంగా నిర్మించిన కోనేరును పరిశీలించారు. దానిచుట్టూ భద్రత కోసం పెంచన్ ఏర్పాట్లు తదితర వాటిని నిర్మిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఈవో సదయ్య, ధర్మకర్తలు శ్రీకాంత్, కనికిరెడ్డి సతీష్, బత్తుల రమేష్,ఆరెల్లి ముండయ్య, కర్రె కుమారస్వామి, చింతం వెంకటస్వామి, చింతమొగిలి, మల్లేశం గంపకిషోర్, రౌతు స్వర్ణలత, మూడెత్తుల శ్రీనివాస్, అర్చకులు వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బూడిద సమస్య పరిష్కారానికి కృషి

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

అంతర్గాం, జనవరి 14: కుందనపల్లి ప్రజలు ఎదుర్కొటున్న బూడిద సమస్యను పరిష్కరిస్తారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ హామీ ఇచ్చారు. మండల పరిధిలోని కుందనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోగల అక్బర్‌నగర్‌లోని ఉర్దూ మీడియం పాఠశాలను ఆదివారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో గల మౌలిక వసతులను పరిశీలించారు. పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ ఎండీ షబ్బీర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కుందనపల్లి పంచాయతీ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న బూడిద సమస్యను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. అక్బర్‌నగర్‌లో నిర్మించిన వాటర్ ట్యాంకుకు కనెక్షన్ ఇప్పించి ప్రజలకు మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు కొండల రాజేందర్, ఎండీ లియాఖత్‌లు గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్‌కే ఇఫ్తాకర్ అహ్మద్, ఎండీ చాంద్‌పాషా, సంగనవేని శేఖర్, సుంకరి రవీందర్ పాల్గొన్నారు.


సుల్తానాబాద్‌లో భోగి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు


గోదావరిఖనిలో భోగిమంట వేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ దంపతులు

స్థలాల కబ్జాపై ఆర్‌ఎఫ్‌సీఎల్ చర్యలు


అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న ఆర్‌ఎఫ్‌సీఎల్ సెక్యూరిటీ సిబ్బంది

కోల్‌సిటీ, జనవరి 14: ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు చెందిన స్థలాల కబ్జాయత్నాలపై ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం చర్యలకు ఉపక్రమించింది. ఎఫ్‌సీఐ నుంచి ఆర్‌ఎఫ్‌సీఎల్ స్థలాలను లీజుకు తీసుకోవడంతో ప్రస్తుతం ఆర్‌ఎఫ్‌సీఎల్ పరిధిలో ఉన్నాయి. సంజయ్‌గాంధీనగర్ సమీపంలో ఆక్సిడైజేషన్ పాండ్(బూడిద చెరువు) స్థలంలో కబ్జాకు కొంతమంది యత్నిస్తున్నారు. నేరుగా పాండ్ లోపలనే చదును చేసి ప్రహరీలు నిర్మించారు. ఈ విషయంపై ఇప్పటికే ఎఫ్‌సీఐ యాజమాన్యం ఎఫ్‌సీఐ, ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్రతినిధులు పోలీస్ కమిషనర్‌కు, నగరపాలక సంస్థ కమిషనర్‌కు ఫిర్యాదులు చేశారు. కొందరు వ్యక్తులు వివిధ కారణాలు చెప్పి ఈ స్థలాల ఆక్రమణకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. చదును చేస్తున్న సమయంలో కూడా కింద బూడిద బయటపడింది. ఆదివారం ఆర్‌ఎఫ్‌సీఎల్ ఎస్టేట్ విభాగం ఆధ్వర్యంలో సెక్యూరిటీ సిబ్బంది చర్యలకు ఉపక్రమించారు. నిర్మాణాలను కూల్చివేశారు. గతంలోనే సంజయ్ గాంధీనగర్ ప్రాంతంలో ఆర్‌ఎఫ్‌సీఎల్ స్థలాల కబ్జా యత్నాలు జరుగగా ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం కూల్చివేసింది. ఇప్పుడు నేరుగా కొందరు ఆక్సిడైజేషన్ ప్లాండ్‌లోనే కబ్జాలకు పాల్పడుతున్నారు.

ఘనంగా భోగి వేడుకలు

- హరిదాసుల సందడి
- గంగిరెద్దుల విన్యాసాలు
- అంబరాన్నంటిన సంబరాలు

సుల్తానాబాద్, జనవరి 14: సుల్తానాబాద్ పట్టణంలో భోగి పండుగ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. స్థానిక పదవ వార్డు గాంధీనగర్ వద్ద ప్రతీ ఏటా నిర్వహించినట్లుగానే ఈసారి కూడా ఈ పండుగ వేడుకలు నిర్వహించారు. గాంధీ విగ్రహం ముందు బోగి మంటలను, పండుగ వేడుకలను కౌన్సిలర్ అనుమాల అరుణబాబురావు, ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేయగా, ఎమ్మెల్యే విజయరమణారావు భోగి మంటలను వెలిగించి ప్రారంభించారు. భోగిమంటల చుట్టూ మహిళలు, నాయకులు నృత్యాలు చేశారు. హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటే సిరులు తెచ్చే పండుగ అని, సంబరాలు క్రమం తప్పకుండా నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. మినుపాల ప్రకాష్‌రావు, అంతటి అన్నయ్యగౌడ్ పుష్పలత, గుండా మురళి, రాజయ్య, బిరుదు క్రిష్ణ, రఫీ, కిశోర్, మేడి శ్రీనువాస్, సన్నీ తదితరులతోపాటు గాంధీనగర్‌వాసులు, యువతీ యువకులు నాయకులు పాల్గొన్నారు.

మంథని, జనవరి 14 : సంక్రాంతి పండగను పురస్కరించుకొని ప్రజలు భోగి వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే ఇండ్ల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టుకున్నారు. అనంతరం ఇండ్లలో, ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయ అవరణలో శ్రీగోదా-రంగనాయకుల కళ్యాణోత్సవాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై వేదోక్తంగా పండితులు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. శ్రీలక్ష్మీనారాయణస్వామి భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఇండ్లలో పిండి వంటలు ఆరగించారు. పతంగులు ఎగురవేశారు.

మంథని రూరల్, జనవరి 14: మండలంలోని కాకర్లపల్లి గ్రామంలో శ్రీపెద్దమ్మతల్లి ఆలయంలో బోనాల వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున బోనాలతో తరలివచ్చి అమ్మవారి నైవేద్యంగా సమర్పించారు. ఒగ్గు కళాకారులు పట్నాలు వేసి శ్రీపెద్దమ్మతల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, జనవరి 14 : మండలంలోని పెద్దబొంకూరు గ్రామంలో భోగి పండుగ వేడుకలు వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మిట్టపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భోగి మంటల చుట్టూ గ్రామస్థులు ఉండి పలువురికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింహస్వామి, శ్రీనివాస్, మురళీధరస్వామి, శ్రీనివాస్, కారుపాకల జంపయ్య, వేముల సురేష్, కలవేన రవి, బొంగాని వెంకటేష్, నాగరాజు, రమేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

జూలపల్లి, జనవరి 14 : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఆదివారం భోగి పర్వదిన వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటిముందు వాకిళ్లలో అందమైన రంగురంగుల ముగ్గులు వేసేందుకు ఆడపడుచులు పోటీలు పడ్డారు. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా, ఆకట్టుకునేలా ముగ్గులను వేశారు. కొత్త అల్లుళ్ల రాకతో ఆయా కుటుంబాల్లో సందడి నెలకొంది.

కళ్యాణ్‌నగర్, జనవరి 14: గోదావరిఖనిలో భోగి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునే ఇళ్లముందు రంగురంగుల సంక్రాంతి ముగ్గులను వేశారు. ముగ్గులను ఆవుపేడతో తయారుచేసిన గొబ్బెమ్మలు, నవధాన్యాలు, రేగుపండ్లు, వివిధ రకాల పూలతో అలంకరించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. భోగి సందర్భంగా దుర్గానగర్‌లోని తన నివాసంలో భోగి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నిర్బంధపు చీకట్లను రూపుమాపి కొత్త కాంతులు ఇంటింటా వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రామగుండం ప్రజలకు భోగభాగ్యాలను అందించే భోగి కొత్త కాంతులు తెచ్చే సంక్రాంతి, కనుమ పండులను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, కాంగ్రెస్ నాయకులు కాల్వ లింగస్వామి, మారెల్లి రాజిరెడ్డి, పాతిపెల్లి ఎల్లయ్య, నాయిని ఓదెలు, కొప్పుల శంకర్, గట్ల రమేష్ పాల్గొన్నారు. గోదావరిఖని చౌరస్తాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన భోగి వేడుకలకు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ముఖ్య అతిథిగా హాజరై భోగిమంటలు వేశారు. రామగుండం ప్రజలు సిరి సంపదలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పాముకుంట్ల భాస్కర్, నాయకులు బొడ్డు రవీందర్, అచ్చె వేణు, మెతుకు దేవరాజ్, చెలుకలపెల్లి శ్రీనివాస్, దొమ్మేటి వాసు, తోకల రమేష్, నూతి తిరుపతి, నీరటి శ్రీనివాస్, రమ్యయాదవ్, స్వప్న, ఇరుగురాళ్ల శ్రావణ్, సందీప్ పాల్గొన్నారు. గోదావరిఖని రాజలక్ష్మికాలనీలో భోగి వేడుకలను నిర్వహించారు. కాలనీ మహిళలు భోగిమంటలు వేశారు. తెల్లవారుజామునే ఇండ్ల ముందు కల్లాపి చల్లి రంగు రంగుల సంక్రాంతి ముగ్గులను వేశారు. మహిళలు సాంప్రదాయ చీరలు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాధవి, రమ, కవిత, తిరుమలేశ్వరి, రాధ, విద్య, స్వప్న, స్వరూప, సునీత, కేపీ రాజ్‌కుమార్, శంకర్, శంకర్, రవి, సురేష్ పాల్గొన్నారు.


చౌరస్తాలో భోగి మంట వేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


భోగిమంట వేస్తున్న మహిళలు

సిరిసిల్ల మానేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో
పుస్తకాల బహూకరణ



హైదరాబాద్‌లో ఆకర్షణకు పుస్తకాలు అందిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, జనవరి 14: హైదరాబాద్‌కు చెందిన అకర్షణ సతీష్‌కు ఆదివారం సిరిసిల్ల మానేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేతుల మీదుగా పిల్లల సాహితీ పుస్తకాలను బహూకరించారు. హైదరాబాద్‌లోని పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న ఆకర్షణ సతీష్ ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల్లో పదికి పైగా గ్రంథాలయాలను ఏర్పాటు చేసి భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్రమోదీలతో సత్కారాలను పొందారు. ఆమెను ప్రోత్సహించేందుకు మానేరు రచయితల సంఘం (మారసం) వ్యవస్థాపకుడు డాక్టర్ పత్తిపాక మోహన్ వెయ్యి పిల్లల పుస్తకాలను అందించేందుకు సంకల్పించి బాల సాహిత్య పరిషత్ చొక్కపు వెంకటరమణ, దక్కన్ సాహిత్యసభ అబ్దుల్‌గనీలు మరికొన్ని పుస్తకాలు సమకూర్చగా వాటిని కేంద్ర మంత్రి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో మారసం నిర్వాహక అధ్యక్షుడు ఎలగొండ రవి, బాలసాహిత్య పరిషత్ అధ్యక్షుడు చొక్కపు వెంకటరమణ, దక్కన్ సాహిత్య సభ కన్వీనర్ డాక్టర్ ఎస్‌కె అబ్దుల్‌గనీ పాల్గొన్నారు.

19 నుంచి జాతీయ స్థాయి
ఫిడే రేటింగ్ చదరంగ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 14: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్ చెస్ అకాడమి ఆధ్వర్యంలో ఈనెల 19, 20, 21తేదీల్లో జాతీయ స్థాయి ఫిడే రేటింగ్ చదరంగ పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో అండర్-1600 ఫిడే రేటింగ్ కలిగిన చదరంగ క్రీడాకారులకు ఈ పోటీలను అఖిల భారత స్థాయిలో నిర్వహించనున్నామని పోటీల నిర్వహణ కమిటి సభ్యులు బి రమణారావు, అంతగిరి రాజేంద్రప్రసాద్, చెరుకు ప్రద్యుమ్నకుమార్, రాజభాను, ఎ విశ్వనాథ్ ప్రసాద్ తెలిపారు. జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ స్థాయి చదరంగ పోటీలు నిర్వహించడం ఇదే మొదటిసారి అని వివరించారు. ఈ పోటీలకు అంతర్జాతీయ సమాఖ్య, అల్ ఇండియా చెస్ ఫెడరేషన్ గుర్తింపు ఉందన్నారు. చెస్ పోటీలను 9 రౌండ్లలో స్విస్, లీగ్ పద్ధతిలో నిర్వహించనున్నామని చెప్పారు. గెలుపొందిన క్రీడాకారులకు రెండు లక్షల రూపాయల నదగు బహుమతులను అందచేస్తామని తెలిపారు. ఓపెన్ కెటగిరిలో 20 నగదు బహుమతులు, అండర్-1,200, అండర్-1,400 రేటింగ్ కేటగిరిలో 10 నగదు బహుమతులను, అన్ రేటెడ్ క్రీడాకారులకు 5, వెటరన్ విభాగంలో 5 నగదు బహుమతులను అందజేస్తున్నామని తెలిపారు. వీటితోపాటు బాల, బాలికలకు అండర్-9, 11, 13, 15 విభాగాలలో పోటీలను నిర్వహించి, నగదు బహుమతులతోపాటు ప్రత్యేక బహుమతులను అందచేస్తామని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 17లోపు తమ ఎంట్రీలను 9030177607నంబరుకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని సూచించారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి
'ఖని' ఎన్ఎస్ఎస్ వలంటీర్



దినేష్

కోల్‌సిటీటౌన్, జనవరి 14: కేంద్ర ప్రభుత్వ యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేది నుంచి 20వ తేది వరకు హైదరాబాద్‌లో జరిగే జాతీయ సమైక్యతా శిబిరానికి గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ కళ్యాణం దినేష్ ఎంపికయ్యాడు. ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న దినేష్ ఎంఎల్ఆర్ ఇన్‌స్టూట్ ఆఫ్ టెక్నాలజీలో జరిగే శిబిరంలో పాల్గొంటాడు. దేశంలోని 12 రాష్ట్రాల నుంచి వివిధ యూనివర్సిటీలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొనే శిబిరంలో కళాశాల నుంచి దినేష్ పాల్గొనడం విశేషం. కాగా కళాశాల చెందిన విద్యార్థి జాతీయ సమైక్యతా శిబిరంలో పాల్గొనడం పట్ల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రమాకాంత్, అధ్యాపకులు సురేష్‌కుమార్, రవి, సావిత్రి, అజయ్, యాదయ్య, సల్మాసుల్తానా, అజీజ్, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ వై.ప్రసాద్, శాతవాహన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మనోహర్ అభినందించారు.

చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

కోల్‌సిటీ, జనవరి 14: నిబంధనలకు విరుద్ధంగా చైనా మాంజా విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం సీపీ రెమరాజేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. చైనా మాంజా వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, గాలిపటాలు ఎగురవేసే క్రమంలో పక్షులతో పాటు సాధారణ ప్రజలు ప్రమాదానికి గురవుతున్నారని తెలిపారు. గాలిపటాలు ఎగురవేసే వ్యక్తులు కూడా ప్రమాదాలకు గురైన సందర్భాలున్నాయని చెప్పారు. దీంతో చైనా మాంజాను రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించిందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ చట్టం 1986ప్రకారం మాంజా అమ్మినా, కొనుగోలు చేసినా నేరమని, ఏడేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధించనున్నామని తెలిపారు. చైనా మాంజా విక్రయించే దుకాణాలపై తనిఖీలు ఉంటాయని తెలిపారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు



గాయపడ్డ శ్రీచరణ్, దేవయ్య

సిరిసిల్ల రూరల్, జనవరి 14: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు గ్రామంలో ఆదివారం కుక్కలు స్వైర్య విహారం చేసి గ్రామస్థులపై దాడులు చేయడంతో ముగ్గురు గాయాలకు గురయ్యారు. గ్రామానికిచెందిన మూడు సంవత్సరాల శ్రీచరణ్ అనే బాలుడితో పాటు గీతా కార్మికుడైన వంగ దేవయ్య గౌడ్, దానవేని ఎల్లవ్వలు రోడ్డుపై నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. వెంటనే గాయపడ్డ వారిని గ్రామస్థులు సిరిసిల్ల జిల్లా అనుపత్రికి తరలించి చికిత్స చేయించారు. గ్రామంలో కుక్కల బెడదను నివారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గాలిపటం ఎగురవేస్తూ గాయపడిన బాలుడు

కొడిమ్యాల, జనవరి 14: మండలంలోని బొల్లోని చెరువు గ్రామానికి చెందిన చెల్ల రిషిత్ అనే 11 ఏళ్ల బాలుడు ఆదివారం గాలిపటం ఎగురవేస్తుండగా వెనుకకు నడుస్తూ కిందపడి గాయపడ్డాడు. చేతికి బలమైన గాయమైంది. గాయపడిన బాలుడిని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కృష్ణారావు పరామర్శించారు. ఆయన వెంట ఉప సర్పంచ్ రమేష్, బీఆర్ఎస్ నాయకుడు లక్ష్మణ్ రెడ్డి, మల్లయ్య, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కోల్‌సిటీ, జనవరి 14: గోదావరిఖని మార్కండేయకాలనీలో నివాసముండే సీతారాం అనే ప్రైవేట్ లెక్చరర్ ఇంట్లో చోరీ జరిగింది. తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు 3తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. సీతారాం కుటుంబ సభ్యులతో ఈ నెల 1వ తేదిన హైదరాబాద్‌కు వెళ్లాడు. గేట్‌కు తాళం వేసి ఉండడంతో ఇంట్లో చొరబడిన దొంగలు ఇంట్లోని ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుడు గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మేడిపల్లి, జనవరి 14: మేడిపల్లి మండల కేంద్రంలోని పెట్రోల్ పంపు వద్ద ఆది వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. కాచారం గ్రామానికి చెందిన కొప్పెర మోహన్‌రెడ్డి (54) అను వ్యక్తి ఏపీ 15 బీసీ 6561 గల హెచ్ఎఫ్ డీలక్స్ పై పెట్రోల్ పంపు వైపు రోడ్డు దాటుతుండగా జగిత్యాల నుంచి కోరుట్ల వైపు వెలుతున్న కారు ఏపీ 25 ఏ ఎల్ 0477 నెంబర్ గల కారు ఢీకొట్టి, రెండు కాళ్లపై నుంచి వెళ్లడంతో మోహన్ రెడ్డి తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సంఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు.

నిందితుడి అరెస్ట్


అరెస్ట్ చూపుతున్న సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్

సిరిసిల్ల క్రైం, జనవరి 14: గంభీరావుపేట మండలంలోని లింగన్నపేట గ్రామానికి చెందిన అంబటి శ్రీకాంత్(35) అనే నిందితుడిని అరెస్ట్ చేశామని సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ తెలిపారు. ఆదివారం సిరిసిల్లలోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇతను ముస్తాబాద్ మండల కేంద్రంలోని బిట్ల వెంకటేశ్‌కు చెందిన ఇంటికి ఈనెల 11న అర్ధరాత్రి వెళ్లి తాళం పగులగొట్టి లోపలికి చొరబడి బీరువాలోని ఏడు తులాల బంగారు అభరణాలు, 12 తులాల వెండి అభరణాలు, రూ. 45 వేలు ఎత్తుకెళ్లాడని తెలిపారు. ఈ సంఘటనపై ముస్తాబాద్ ఎస్ఐ కె. శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంగా ఏర్పడి ఆధునిక సాంకేతికత , సీసీ కెమెరాల ఆధారంగా 24గంటల్లో చోరీచేసిన దొంగను చేధించి పట్టుకున్నారన్నారు. నిందితుడు శ్రీకాంత్‌ను పట్టుకొని విచారించగా చోరీచేసినట్లు అంగీకరించాడ ని, ఇతని వద్ద రూ. 31వేల నగదు, పల్సర్ బైక్, దొంగిలించిన సొమ్మును స్వాధీనం పరుచుకొని రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

చెప్పుల దుకాణం దగ్ధం


దగ్ధమవుతున్న దుకాణం

మల్యాల, జనవరి 14: దిగువ కొండగట్టులో గల చెప్పుల దుకాణం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం అయింది. శంకర్‌కు చెందిన చెప్పుల దుకాణంలో షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగగా స్థానికులు మంటలు ఆర్పివేశారు. దుకాణంలోని మూడు లక్షల రూపాయలకు పైగా విలువైన చెప్పులు కాలి బూడిద అయ్యాయి. కాగా డబ్బాలో గల రూ.1.50లక్షల నగదు సురక్షితంగా ఉండగా మంటలను ఆర్పివేసిన అనంతరం వాటిని బయటకు తీశారు.

రాజకీయాల కోసం దేవుడినీ వదలడం లేదు

● ప్రశ్నించిన వారిపై హిందూ వ్యతిరేకులుగా ముద్ర ● రాముడు కొందరి వాడు కాదు.. అందరివాడు ● రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్


కరీంనగర్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ/కరీంనగర్ అర్బన్, జనవరి 14: రాజకీయ లబ్ధి కోసం, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు కోసం కొందరు దేవుడిని కూడా వదలడం లేదని, అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఆదివారం అయన కుటుంబ సమేతంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఏ రాజకీయ నాయకుడు కూడా దేవాలయాలు ప్రారంభోత్సవం చేయరని, విగ్రహ ప్రతిష్ఠ, శిలాన్యాస కార్యక్రమాలు పాలకుల చేతుల మీదుగా కాకుండా పీఠాధిపతుల చేతుల మీదుగా చేస్తారని గుర్తు చేశారు. ఆలయ నిర్మాణం పూర్తి కాలేదని జగద్గురువులు చెబుతున్న విషయాన్ని ప్రతీ ఒక్కరు గమనించాలన్నారు. అలయ నిర్మాణం పూర్తి కాకున్నా, ప్రారంభోత్సవానికి సరైన సమయం కాకున్నా వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రజల దృష్టి మళ్లించి మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ఈ అంశాన్ని వాడుకుంటున్నారని విమర్శించారు. వీటన్నింటినీ ప్రశ్నించిన తమపై హిందువులకు వ్యతిరేకమనే ముద్ర వేస్తున్నారని, హిందుత్వాన్ని విశ్వసించే వారు ఈ పరిణామాలపై ఆలోచన చేయాలని, దేవుడు కొందరి వాడు కాదు అందరి వాడని, కులం, ధనం, అధికారం పదవులతో సంబంధం లేకుండా రాముడు, శివుడు, హన్మంతుడిని ప్రతీ ఒక్కరూ కొలుస్తారని అన్నారు. పార్లమెంటులో అదానీ, అంబానీకి సంబంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక రాముడిని ముందుకు తీసుకువచ్చి ఎన్నికల్లో గెలిచే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మండల్ కమిషన్‌తో పేదలకు, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేసిందని, కమండల్ కమిషన్‌తో వాళ్లు ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

● రాజన్న ఆలయ అభివృద్ధికి కృషి..

రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, రైతులు, ప్రజలు బాగుండాలని రాజరాజేశ్వరస్వామి వారిని కోరుకున్నానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వేములవాడ అలయ అభివృద్ధిపై తదుపరి చర్యల కోసం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించామని, మహాశివరాత్రి కంటే ముందే ఈనెల 30వ తేదీలోగా వీటీడీఏ మీటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. రాజరాజేశ్వర స్వామివారి భక్తులుగా ఆలయ అభివృద్ధి బాధ్యత తమపై ఉందని, ఎవరూ ప్రశ్నించకముందే వేములవాడ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

● కరీంనగర్‌లో జర్నలిస్టులతో చిట్‌చాట్ అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ ఎన్నికల ఖర్చుకు మంగళసూత్రాలు అమ్ముకున్నానని చెప్పిన బండి సంజయ్ ఐదేళ్లలో ఏ ఊరులో చూసినా లక్షల రూపాయల పెద్దపెద్ద కట్‌అవుట్స్ పెట్టుకుంటున్నాడని, ఈ డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయన్నారు. కరీంనగర్ లోక్‌సభ సీటు కాంగ్రెస్ గెలుచుకుంటుందని, గత ఎన్నికల్లో మతంపేరిట, ఆస్కార్ అవార్డు తరహాలో నటన చేశాడు కాబట్టి గెలిచాడని, ఈసారి అలా కానివ్వమన్నారు. జిల్లాకు ప్రస్తుత ఎంపీ బండి సంజయ్, మాజీ ఎంపీలు వినోద్‌కుమార్, కేసీఆర్‌లు ఏ పథకాలు, ఏ మేర నిధులు తీసుకువచ్చారో చెప్పాలన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు రైల్వేలైన్, మోడల్‌స్కూల్, పాస్‌పోర్ట్ కార్యాలయం, కేంద్రీయ విద్యాలయం, ఎఫ్ఎం రేడియో, ఎలగందుల టూరిజం వంటివి పథకాలను, నిధులను తీసుకవచ్చానని, దీనిపై చర్చకు సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. ప్రస్తుత ఎంపీ ఐదేళ్లలో చేసిన ఒక్క పని చెప్పమనండి అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌పార్టీ దేశాభివృద్ధికి కూడబెట్టిన కేంద్ర సంస్థలను బీజేపీ ప్రభుత్వం అమ్ముతోందని అన్నారు. కేటీఆర్‌కు అధికారం పోయిన బాధలో ఉన్నాడని, పదవిలో నుంచి దిగిపోతారని ఎప్పుడూ కలలో కూడా ఊహించలేదని అందుకే అసహనంలో ఉన్నాడన్నారు.

రాజన్న సేవలో మంత్రి పొన్నం

వేములవాడ, జనవరి 14: రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి సేవలో తరించారు. ఆదివారం ఉదయం ఆయన కుటుంబ సమేతంగా శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు సాంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొని, కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అర్చకులు వేద పండితులు ఆశీర్వదించగా, ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ స్వామివారి ప్రసాదం అందజేశారు. అంతకుముందు రాజన్న ఆలయం ముందు ఆయనకు ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం కోసం వచ్చిన మంత్రి పొన్నంకు స్థానిక ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ నాగేంద్రచారి తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, నాయకులు చిలుక రమేష్, కూస రవీందర్ సంగీతం శ్రీనివాస్, తూమ్ మధు, పాత సత్యలక్ష్మి, పులి రాంబాబు, చందుర్తి జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, స్థానిక నాయకులు ఉన్నారు.


కోడెమొక్కు చెల్లించుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వీరభద్రనామస్మరణతో మార్మోగిన కొత్తకొండ

● జాతరలో భక్తుల కిటకిట
● గుమ్మడికాయలు, కోరమీసాలు చెల్లించుకున్న భక్తులు


జాతరకు వస్తున్న కుమ్మర్ల ఎడ్లబండ్లు


గుమ్మడికాయ మొక్కులు చెల్లిస్తున్న యువతులు

భీమదేవరపల్లి, జనవరి 14: వీరభద్రా... శరభా... శరభా.... అంటూ భక్తుల శరణుఘోషతో కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయం మార్మోగింది. భక్తుల వీరభద్రస్వామి నామస్మరణతో పులకించిపోయింది. ఉత్తర తెలంగాణ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బోగి పండుగను పురస్కరించుకొని ఆదివారం భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. శీఘ్ర దర్శనం, ప్రత్యేక దర్శనం, వీఐపీ దర్శనం, సర్వ దర్శనం ఇలా అన్ని క్యూలైన్లు భక్తాజనంతో కిక్కిరిసిపోయాయి. ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలు వీరభద్ర నామస్మరణతో మార్మోగాయి. పవిత్ర కోనేరులో స్నానాలచరించిన అనంతరం పుట్టు వెంట్రుకలు అప్పజెప్పి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల తాకిడికి క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. దర్శనం కోసం భక్తులు మూడు నుంచి నాలుగు గంటల పాటు వేచి చూశారు. కోరిన కోర్కెలు తీర్చాలని కోడెలను కట్టారు. స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన కోరమీసాలు, గుమ్మడి కాయలు భక్తులు అప్పజెప్పారు. తమ గండాలు తొలగాలని గండాదీపంలో నూనె పోశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో కిషన్‌రావు, జాతర చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్, దేవాదాయ శాఖ ఏసీ సునీతలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్, ఎల్కతుర్తి సీఐ ప్రవీణ్‌కుమార్, ముల్కనూర్, వంగర ఎస్ఐలు సాయిబాబు, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 400 మంది పోలీసులు బందోబస్తును నిర్వహించారు. ముల్కనూర్ ఏకేవీఆర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు 50 మంది జాతరలో పలు సేవలందించారు. ఆలయ ఈవో కిషన్‌రావు జాతరకు పాలకవర్గ కమిటీ లేకపోవడంతో అన్ని తానై ఏర్పాట్లను పర్యవేక్షించాడు. సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్‌లు జాతరకు వచ్చి స్వామివారికి గుమ్మడికాయ మొక్కులు, కోరమీసాల మొక్కులు చెల్లించారు.

భోగి పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు...

బోగి పండుగను పురస్కరించుకొని స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి సూర్యయంత్ర ప్రతిష్ఠాపన, అరుణ పారాయణం, సూర్య నమస్కారాలు, మహాన్యాసపూర్వ రుద్రాభిషేకం, పుణ్యహవచనం నిత్య బలిహరణ, అమ్మరికి శ్రీచక్రార్చన, నవావరణ పూజ చండీహోమం నిర్వహించారు. భోగి పండుగను పురస్కరించుకొని నందీశ్వర పూజలు చేశారు.

కుమ్మరుల బోనాలతో ప్రారంభమైన ఎడ్లబండ్లు...

ప్రతీ ఏడాది బ్రహ్మోత్సవాలలో కుమ్మరులు బోనాలను వండి తమ ఎడ్లబండ్లను ప్రదక్షిణలు చేసిన తర్వాతరోజు నుంచి ఎడ్లబండ్ల కార్యక్రమం జరగడం ఆనవాయితీగా వస్తుంది. దీంట్లో భాగంగా కుమ్మరులు ఆదివారం సాయంత్రం బోనం గద్దె వద్ద వీరభద్రుడికి వీరబోనం చేశారు. కుమ్మరులు బోనాలను నెత్తిన పెట్టుకొని వీరభద్రుడికి ఇష్టమైన ప్రభలతో వెళ్తుండగా శివసత్తులు వీరబోనంతో గటంకుండతో నృత్యాలు చేశారు. వీటివెనుక అందంగా అలంకరించిన ఎడ్లబండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలుచేసి కుమ్మరులు వీరభద్రుడిని దర్శించుకున్నారు. గద్దె వద్ద బోనం సమర్పించారు. కడిపికొండ, ఉల్లిగండ దామెరకు చెందిన మహిళలు గుమ్మడికాయలను ఎత్తుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు.

మోదీ పాలనలో ఆర్థిక తిరోగమనం

- ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి


స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, నాయకులు

జగిత్యాల టౌన్, జనవరి 14: మోదీ పాలనలో భారతదేశం ఆర్థిక తిరోగమనంలోకి వెళ్లిందని ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారత్ జోడో న్యాయ యాత్ర పోస్టర్లను, వాల్ స్టిక్కర్లను నాయకులతో కలిసి జీవన్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ పాలనలో దేశం ఆర్థికంగా తిరోగమనం చెందడంతో పాటు నిత్యావసర సరుకుల ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరించిందన్నారు. ప్రతీ పేదవాడి బ్యాంకు ఖాతాలో రూ. 15 లక్షల వేస్తామని చెప్పిన మోదీ ప్రభుత్వం కనీసం 15 రూపాయలు కూడా వేయలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలోనే ప్రతీ పేదవాడికి న్యాయం జరిగిందన్నారు. రాహుల్ గాంధీ చేపడుతున్న భారత్ జోడో న్యాయ యాత్రను ప్రజలు, నాయకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కమటాల శ్రీనివాస్, గుండ మధు తదితరులు ఉన్నారు.

విద్యుత్ మోటర్లు దొంగిలించి
ఇనుప సామాను షాపుల్లో విక్రయం?

బీర్‌పూర్, జనవరి 14: పంటపొలాల్లో నీరు పారించడం కోసం రైతులు ఉపయోగించే విద్యుత్ మోటర్లు వరుసగా చోరీకి గురవుతున్నాయి. దీంతో పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తు జరుపుతున్న క్రమంలో పొరుగు జిల్లాలోని ఓ మండల కేంద్రంలో పోలీసులు దొంగలను పట్టుకున్నట్లు సమాచారం. అయితే మోటర్లు ఎత్తుకెళ్లి సమీప మండల కేంద్రంలోని ఓ పాత ఇనుప సామాన్లు కొను గోలు చేసే షాపుల్లో విక్రయించినట్టు దొంగలు ఒప్పుకున్నట్లు చర్చ జరుగుతోంది.

మండలంలో రైతులకు నిద్రపట్టకుండా చేసిన దొంగలు దొరికారన్న వార్త తెలియడంతో ఇటీవల జరిగిన దొంగతనాలకు కారకులు వీరేనా అనే చర్చ మండలంలో జరుగుతోంది. నూతన సంవత్సరం రోజున శాంతిస్థూపం సమీపంలో గల కిరాణం షాపునకు అమర్చిన ఇనుప జాలీని కట్ చేసి సామగ్రి దొంగిలించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు సీసీ కెమెరాలు ఉంటే దొంగలు కచ్చితంగా దొరికి ఉండేవారని చర్చించుకుంటున్నారు.

రాయికల్ టు అయోధ్య

- సైకిల్ యాత్రకు బయలుదేరిన యువకులు


అయోధ్యకు సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న యువకులు

రాయికల్, జనవరి 14: అయోధ్యలో ఈ నెల 22న శ్రీరామచంద్ర ప్రభువు విగ్రహ రూపంలో ప్రాణప్రతిష్ఠ కానుండటంతో రాయికల్‌కు చెందిన యువకులు గుండేటి మాధవ్, నల్లూరి వరుణ్ రాయికల్ నుంచి అయోధ్యకు సైకిల్ యాత్రను చేపట్టారు. రాయికల్ హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అయోధ్య వరకు సైకిల్ యాత్రతో బయలుదేరారు. రామమందిరం నిర్మాణమైతే రాయికల్ నుంచి సైకిల్ యాత్ర నిర్వహిస్తామని మొక్కుకున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ యాత్ర సుమారు 1150 కిలో మీటర్లు ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా శ్రీరాముని భగవాధ్వజాన్ని ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తురగ శ్రీధర్ రెడ్డి, రాకేష్ నాయక్, శ్రీరామ తీర్థ క్షేత్ర సమితి బాధ్యులు తురగ రాజరెడ్డి, కాయితి గంగాధర్, వేల్పుల స్వామి యాదవ్, దొంగ జితేందర్ రెడ్డి, బొమ్మకంటి రాంగోపాల్ జీ, బొడుగం మోహన్ రెడ్డి, గాజెంగి అశోక్, కుర్మ మల్లారెడ్డి, తోపారపు రవీందర్, గన్నవరం గంగాధర్, వాసం జలంధర్, మామిడాల లక్ష్మీనారాయణ, శ్రీగద్దె సుమన్ పాల్గొన్నారు.

వైభవంగా గోదారంగనాయకుల కల్యాణం

వేములవాడ, జనవరి 14 : శ్రీరంగనాయకస్వామి, గోదాదేవిల దివ్య కల్యాణం వేములవాడలో ఆదివారం సాయంత్రం వైభవంగా జరిగింది. రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అనుబంధ వేణుగోపాల స్వామివారి ఆలయంలో ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ నేతృత్వంలో అర్చకులు, వేదపండితుల బృందం రంగనాయకస్వామి, గోదాదేవిల ఉత్సవమూర్తులను స్వామివారి కల్యాణ మంటపంలో అందంగా అలంకరించి వివాహ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ హరిహరనాథ్, ఆలయ సిబ్బంది, భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించి తరించారు.

● కొండగట్టులో..

మల్యాల: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో ఆదివారం గోదారంగనాథుల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ప్రత్యేకించి అలంకరించిన వేదికపై ఉత్సవమూర్తులకు కల్యాణాన్ని శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్ఛరణలు మధ్య కల్యాణాన్ని ఆలయ అర్చకులు, వేదపండితులు వైభవంగా జరిపారు. కల్యాణానికి ఆలయ అధికారులు పట్టు వస్త్రాలను స్వామి వారికి సమర్పించారు. కల్యాణం సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో వెంకటేష్, ఫౌండర్‌ట్రస్టీ మారుతీస్వామి, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, సునీల్ ఆలయ స్థానాచార్యులు కపీంధర్, ప్రధానర్చకులు జితేంద్రప్రసాద్, రామకృష్ణ, రఘు టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సంపత్, లక్ష్మారెడ్డి అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



వేములవాడ, కొండగట్టులో గోదారంగనాయకుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కబడ్డీ... కబడ్డీ

- ముగిసిన కబడ్డీ శిక్షణ శిబిరం
- శిక్షణలో జాతీయ, రాష్ట్ర కబడ్డీ క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, జనవరి 14: గ్రామీణ ప్రాంతాల్లోని కబడ్డీ క్రీడాకారులు రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. రాష్ట్రంలో జిల్లా, మండల స్థాయిలో కబడ్డీ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను నిర్వహిస్తూ ప్రతిభ ఉన్న క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ స్థాయి జట్టులో అవకాశాలు వచ్చే విధంగా ప్రత్యేక శిక్షణలను నిర్వహిస్తూ క్రీడాకారులలో నైపుణ్యానికి పదును పెడుతున్నారు. ఈ నెల 2న సిరిసిల్ల పట్టణంలో కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్ కబడ్డీ బాలబాలికల ఎంపికల పోటీలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను రాజన్న సిరిసిల్ల జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. సిరిసిల్ల పట్టణం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడామైదానంలో కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిపుణులైన కోచ్‌ల ద్వారా బాలబాలికల జిల్లా కబడ్డీ జట్లకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. కబడ్డీ శిక్షణ శిబిరంలో బాలబాలికల జిల్లా జట్లలో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులు కూడా పాల్గొన్నారు. శిక్షణశిబిరం ద్వారా క్రీడా నైపుణ్యం, జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఎంపికైన క్రీడాకారులతో పరిచయాలు, స్నేహం వారితో అనుబంధాలను వివరించారు. గత గురువారం మెదక్ జిల్లా గజ్వేల్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొనడానికి జిల్లా బాలబాలికల జట్లు సిరిసిల్ల నుంచి తరలివెళ్లాయి.


కబడ్డీ బాలబాలికల జట్లతో నాయకులు

టీ షర్ట్స్ పంపిణీ..

జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిరిసిల్ల ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానాంలో కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా జూనియర్ కబడ్డీ బాలబాలికల జట్లలోని క్రీడాకారులకు టీ షర్ట్స్‌ను అసోసియేషన్ జిల్లా చైర్మన్ జిందం చక్రపాణి, వైస్ చైర్మన్స్ కోడి అంతయ్య అందజేశారు.

శిక్షణ శిబిరాలు ప్రావీణ్యాన్ని పెంచుతాయి

- ఎండీ సానా, జాతీయ స్థాయి క్రీడాకారిణి



కబడ్డీ శిక్షణ శిబిరాలు క్రీడాకారులలో మరింత ప్రావీణ్యాన్ని పెంచు తాయి. మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి టోర్నమెంట్స్ నిర్వహిం చాక ఎంపికైన జట్ల సభ్యులకు ఖచితంగా శిక్షణ శిబిరాలను నిర్వహిం చాలి. శాతవాహన యూనివర్సిటీ నుంచి చెన్నయ్‌లో ఒకసారి కదయ్‌కుడిలో రెండోసారి జాతీయ స్థాయి పోటీలో పాల్గొన్నాను. ఎనిమిది సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను.

ప్రభుత్వం కబడ్డీ క్రీడను ప్రోత్సహించాలి

- జీ పావని, జాతీయ స్థాయి క్రీడాకారిణి



కబడ్డీ క్రీడను ప్రభుత్వం మరింతగా ప్రోత్సహించాలి. గ్రామీణ ప్రాంతాలలో క్రీడామైదానాలు లేవు. ఉన్న క్రీడా మైదానాలలో సౌకర్యాలు లేకపోవడంతో నైపుణ్యం ఉన్నా క్రీడాకారులు వెలుగులోకి రావడం లేదు. మా వ్యాయామ ఉపాధ్యాయులు, కబడ్డీ అసోసియేషన్, కోచ్‌ల ప్రోత్సాహంతో ఈ స్థాయికి వచ్చాము. తమిళనాడు మధురైలో జరిగిన కబడ్డీ పోటీలలో శాతవాహన యూనివర్సిటీ నుంచి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు, ఏడు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను.


గోదావరిఖని వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోదారంగనాథుల కల్యాణం


రఘుపతినగర్‌లో గోదారంగనాయక స్వాముల ఉత్సవ విగ్రహాలు


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా గోదారంగనాథుల కల్యాణోత్సవం

కోల్‌సిటీటౌన్, జనవరి 14: గోదారంగనాథ స్వామి కల్యాణోత్సవం వేడుకలు ఆదివారం గోదావరిఖనిలోని పలు ఆలయాల్లో అంగరంగ వైభవంగా జరిగాయి. స్థానిక బస్‌డిపో సమీపంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో గోదా రంగనాథస్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అచ్చ వేణు, శ్రీనివాస్, బుర్ర శ్రీనివాస్, దేవి లచ్చయ్య, మిట్ట శంకరయ్య, వెంకటేశ్వర్లు, కొమురయ్య, శ్రీనివాస్, కోటేశ్వరరావు, రమేష్, అల్లం సత్యనారాయణ, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే స్థానిక 46వ డివిజన్ కాకతీయ నగర్‌లోని భక్తాంజనేయస్వామి ఆలయంలో అంగరంగవైభవంగా గోదారంగనాథ స్వామి కల్యాణోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, బండారి రాజమల్లు, ప్రెస్‌క్లబ్ జాయింట్ సెక్రెటరీ దాట్ల జెమ్స్‌రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు శంకర్‌రావు పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్, జనవరి 14: గోదావరిఖనిలో పలు ఆలయాల్లో ఆదివారం గోదారంగనాథ స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గోదావరిఖని రఘుపతినగర్‌లోని రంగనాయక స్వామి ఆలయంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మనాలి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆయన కోరారు. కాకతీయనగర్, గోదావరిఖని ఆర్‌టీసీ డిపో వద్ద ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో రంగనాయక కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు వంశీకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బల్మూరి మహేందర్‌రావు, అమరేందర్‌రావు, కృపాకర్‌రావు, రాంమోహన్‌రావు, సాగి అనీల్‌రావు, జువ్వాడి విజయ్, కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, పాతిపెల్లి ఎల్లయ్య, మారెల్లి రాజిరెడ్డి, తాళ్లపల్లి యుగంధర్ పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న మక్కాన్‌సింగ్ దంపతులు

సుల్తానాబాద్, జనవరి 14: సుల్తానాబాద్ పట్టణంలో పెరికిగిద్దె అంజనేయస్వామి ఆలయంలో గోదారంగనాయకుల స్వామి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. కల్యాణంలో తొర్రికొండ ప్రభాకర్ రమాదేవి, శివకుమార్‌మంగ తదితరులు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కమాన్‌పూర్, జనవరి 14 : మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి దేవాలయ ఆవరణలో ధనుర్మాసం చివరి పర్వదినం చివరి రోజైన ఆదివారం గోదారంగస్వామి కల్యాణం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కన్నుల పండువగా జరిగింది. దేవాలయంలోని గోదా రంగనాథస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. కల్యాణం అనంతరం భక్తులు పూలమాలలతో వానమాయురం నృత్యాలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. తాటిపల్లి శ్రీనివాస్, రంగు సత్యనారాయణ, రంగు శ్రీనివాస్, కోలేటి వెంకన్న, కోలేటి బాపు, కొల్లూరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

జూలపల్లి, జనవరి 14 : మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం శ్రీగోదారంగనాయక స్వాముల కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దారబోయిన నర్సింహయాదవ్, విండోచైర్మెన్ కొంజర్ల వెంకటయ్య, ఉపసర్పంచ్ కొప్పుల మహేష్, మెరుగు రమేష్, గుడిపాటి వినిల్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


సుల్తానాబాద్‌లో గోదారంగనాయకుల కల్యాణం


జూలపల్లిలో..


కమాన్‌పూర్‌లో..

బీజేపీ జిల్లా కార్యవర్గం

పెద్దపల్లి, జనవరి 14(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జిల్లా నూతన కార్యవర్గాన్ని నియమించినట్లు అధ్యక్షుడు రావుల రాజేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా తంగెడ రాజేశ్వర్‌రావు, మాతంగా రేణుక, సుల్వా లక్ష్మీనర్స య్యా, మచ్చగిరి రాము, జనరల్ సెక్రెటరీలుగా పోల్సాని సంపత్‌రావు, తాట రవియా దవ్, మామిడి రాజేష్, సెక్రెటరీలుగా తోడుపునూరి క్రిష్ణమూర్తి, జంగ చక్రధర్‌రెడ్డి, ఈర్ల శంకర్, పెద్దపల్లి పవన్, ఈసీ మెంబర్‌లుగా దెవెందర్, పడాల కనుకయ్య, ఐలయ్య, బిరుదు గట్టయ్య, శంకర్ గౌడ్, తిరుపతి రెడ్డి, లక్ష్మణ్, తిరుపతి, కనుకుంట్ల రామస్వామి, ఏ తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, శ్రీనాథ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా ఎర్రో శ్ల శ్రీకాంత్, మహిళ మోర్చా అధ్యక్షురాలుగా చిలుక భారతి, ఓబీసీ మోర్చా అధ్యక్షు డిగా పెద్దపల్లి రవిందర్‌లను నియమించినట్లు తెలిపారు.

పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి ఎమ్మెల్యే చేయూత

కోల్‌సిటీ, జనవరి 14: రామగుండం నగర పాలక సంస్థలో పనిచేస్తూ ఆరు నెలల క్రితం గోదావరిఖని ఆంధ్రా బ్యాంకు వద్ద జరిగిన విద్యుత్ ప్రమాదంలో మృతిచెందిన పారిశుధ్య కార్మికుడు ఐల సందీప్‌కుమార్ కుటుంబానికి ఆదివారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రూ.5లక్షల చెక్కును సందీప్ భార్య పావనికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదంలో సందీప్‌కుమార్ మృతి చెందడం తనను కలిచివేసిందని అన్నారు. సందీప్ మృతి ఆ కుటుంబానికి తీరని లోటని, ఆయన కుటుంబానికి అండగా ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహంకాళి స్వామి, నాయకులు పాతిపెల్లి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కన్నాలలో రక్తదాన శిబిరం

మంథనిరూరల్, జనవరి 14: మంథని మండలం కన్నాల శ్రీవెంకటేశ్వర యూత్ ఏర్పాటు చేసుకొని ఐదేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం యూత్ ఆధ్వర్యంలో గ్రామంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు యూత్ సభ్యులను అభినందించారు. ఈకార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు సంతోష్, ఉపాధ్యక్షుడు కృష్ణకాంత్, గ్రామస్థులు గుడిసె గట్టయ్య, పొయ్యిల రాజయ్య, తోకల మల్లేష్‌లు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

కమాన్‌పూర్, జనవరి 14 : కమాన్‌పూర్ మండలంలోని జూలపల్లి గ్రామ శివారులోని మల్లిఖార్జున స్వామి ఆలయంలో ఆదివారం భక్త జనులతో కిటకిటలాడింది. మండలంలోని వివిధ గ్రామాల నుండే కాకుండా దూర ప్రాం తాల నుంచి అధిక సంఖ్యలో భక్తజనులు తరలి వచ్చారు. మల్లన్న ఆలయంలో భక్తులు పట్నాలు వేసి బోనాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తుల పూనకాలతో మల్లన్న ఆలయం దైవనామస్మరణతో మారుమోగింది.

మల్లన్నస్వామి ఆలయంలో బోనాల సందడి

మంథని, జనవరి 14: స్థానిక భగత్‌నగర్‌లోని శ్రీ చెన్న పర్వతాల మల్లన్న స్వామి దేవాలయంలో భక్తులు ఆదివారం బోనాల వేడుకలు నిర్వహించారు. ఒగ్గు పూజారులు పసుపు బండారి, డోలు వాయిద్యాల మధ్య శ్రీ మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించగా వార్డులోని మహిళలంతా స్వామి వారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మల్లన్న స్వామి బోనాల సందర్భంగా శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణమంతా సందడిగా మారింది. ఈ సందర్భంగా పట్టణంలోని ఆయా వార్డులకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో భగత్‌నగర్ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

'మాదిగలకు రాజకీయాల్లో రిజర్వేషన్లకు పోరాటం'

పెద్దపల్లి రూరల్, జనవరి 14: రాజకీయంగా మాదిగలకు న్యాయంగా రావాల్సిన వాటా సాధించుకోవడం కోసం పోరాటం చేస్తామని మాదిగశక్తి జిల్లా కన్వీనర్ కల్లెపల్లి రవి అన్నారు. మాదిగ శక్తి వ్యవస్థాపకులు బోంకూరి సురేందర్ సన్ని ఆదేశాల మేరకు పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ గ్రామంలో నూతన కమిటీని ఆదివారం ఎన్నిక చేసినట్లు తెలిపారు. గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షులుగా కల్వల రామస్వామి, కుమ్మరి మోహన్ బాబు, కల్లెపల్లి సతీష్, కుమ్మరి స్వర్ణ ప్రకాష్, కుమ్మరి భిక్షపతి, అధ్యక్షుడిగా కుమ్మరి సదయ్య, ఉపాధ్యక్షులుగా రాకేష్, సంజీవ్, ప్రధాన కార్యదర్శిగా మోదుంపల్లి చిన్న అంజయ్య, సంయుక్త కార్యదర్శిగా కుమ్మరి శ్రీశైలం, కోశాధికారులుగా సందీప్, ప్రశాంత్, ప్రచార కార్యదర్శిగా కిషోర్, సతీష్‌లతో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ముగిసిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు


ట్రోఫీని అందుకుంటున్న విజేతలు

సుల్తానాబాద్, జనవరి 14: సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలో పోలీస్ శాఖ నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో సత్యనారాయణ, ఇక్బాల్ జట్టు విజేతగా నిలిచింది. రెండు రోజులుగా సీఐ జగదీష్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న ఈ పోటీలు శనివారం రాత్రి ముగిసాయి. సీఐ జగదీష్, అజయ్ జట్టు ద్వితీయ స్థానంలో, వెంకట్, వెంకటేష్ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, జూలపల్లి, ఎలిగేడు మండలాలకు చెందిన క్రీడాకారులు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

నేత్ర దానం

ఓదెల, జనవరి 14 : మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందిన గొర్ల శ్రీనివాస్ నేత్రాలను ఆదివారం కుటుంబ సభ్యుల అంగీకారంతో సదాశయ ఫౌండేషన్‌కు దానం చేశారు. ఈ మేరకు గోదావరిఖనిలోని ఎల్‌విపి బ్యాంక్ టెక్నీషియన్ నరేందర్ నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు మెరుగు భీష్మచారి మాట్లాడుతూ గొర్ల శ్రీనివాస్ కుటుంబం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. బాధలోనూ నేత్రదానానికి శ్రీనివాస్ కుటుంబం ముందుకు రావడం అభినందనీయమని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రావణ్ కుమార్ తెలిపారు.

ఘనంగా కాట్రేవుల పండుగ


పశువులకు పూజలు చేస్తున్న రైతులు

పెద్దపల్లి రూరల్, జనవరి 14: పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామంలో రైతులు ఘనంగా కాట్రేవుల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి వద్ద కాడెద్దులను అలంకరించి గ్రామంలోని అన్ని పశువులను ఊరు బయట ఒక దగ్గర మామిడి తోరణాలు కట్టి అలంకరించి ఉంచారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆడెపు వెంకటేషం, మార్కు లక్ష్మణ్, బూర్ల గట్టయ్య, రైతులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి

- ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

కళ్యాణ్‌నగర్, జనవరి 14: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన హిట్ అండ్ చట్టాన్ని రద్దు చేయాలంటూ ఆదివారం రామగుండం ఏరియా మోటార్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని పైలాన్ చౌరస్తా వద్ద నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు ఈదునూరి నరేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 106/2 కఠిన చట్టాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త చట్టం ప్రకారం ప్రమాదంలో ప్రాణనష్టం జరిగిన సమాచారాన్ని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించకపోతే జైలు శిక్ష, రూ.7లక్షల జరిమానా విధిస్తూ తీసుకున్న నిర్ణయం మోటార్‌రంగ కార్మికులకు గుదిబండగా మారే ప్రమాదం ఉందని, ఈ చట్టం వల్ల మోటార్ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ నిరసన కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు ఐ కృష్ణ, బొట్టు రవికుమార్, బాబు, మొండయ్య, కలీం, హకీం, ఫజల్, రాజు, గఫార్, అమీన్, రవి, మహిపాల్, అయూబ్, విక్రమ్, ముజాఫర్ పాల్గొన్నారు.

పండుగ పూట బస్సుల కోసం నిరీక్షణ

కళ్యాణ్‌నగర్, జనవరి 14: ప్రభుత్వం ప్రవేశపెట్టి ఉచిత ప్రయాణంతో సర్వీసులు తగ్గించడం, సమయానికి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం గోదావరిఖని బస్టాండ్‌లో ప్రయా ణికులతో కిటకిటలాడింది. కరీంనగర్, భూపాలపల్లి, మంచి ర్యాల, బెల్లంపల్లి, ఆసిఫాబాద్, మంథని, బేగంపేటకు సర్వీ సులు లేకపోవడంతో బస్సుల కోసం వేచిచూడాల్సి వచ్చింది. బస్సులు వచ్చినా ప్రయాణికులతో కిటకిటలాడింది. కాలేజీ లకు, స్కూళ్లకు సెలవులు ప్రకటించడంతో బస్టాండ్‌కు పెద్ద సంఖ్యలో ప్రయాణికులు వచ్చారు. మరో పక్క ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు.


బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

శిథిలావస్థకు చేరిన గ్రంథాలయ భవనం


శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయ భవనం


పెచ్చులూడుతున్న భవనం పైకప్పు

కాల్వశ్రీరాంపూర్, జనవరి 14: మండల కేంద్రంలోని గ్రంథాలయం నిర్వహించే పాత భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో 1989లో గ్రంథాలయమును అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ సమయంలో నిర్మించిన భవనంలో గ్రంథాలయం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ భవనంలోనే గ్రంథాలయ నిర్వహణ జరుగుతుంది. ఈ గ్రంథాయలంలో ఒకటే గది ఉన్న కారణంగా అందులో ఉన్న పుస్తకాలతో పాటు పాఠకులు చదువుకునేందుకు గది కూడా ఇరుకుగా ఉన్నట్లు గ్రంథాలయానికి వచ్చే పాఠకులు తెలిపారు. 34 సంవత్సరాల క్రితం నిర్మించిన గ్రంథాలయ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. గ్రంథాయలం గోడలు కూడా పెచ్చులూడిపోతున్నాయి. ప్రతిరోజు గ్రంథాయానికి 50మందికి పైగా పాఠకులు వచ్చి వార్తాపత్రికలు చదువుతుంటారు. గ్రంథాలయ భవనం పైపెచ్చులు ఏ సమయంలో తమపై పడుతాయోనని భయభయంగానే పత్రికలు చదువుతూ ఉంటారు. అదేవిధంగా గ్రూపులకు సంబంధించిన పుస్తకాలు, పలు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు ఈ గ్రంథాలయంలో ఉన్నాయి. పోటీ పరీక్షలు రాసేవారు కూడా ఈ గ్రంథాలయంకు వచ్చి వారికి సంబంధించిన పుస్తకాలు చదువుకుంటారు. ఈ గ్రంథాలయం వరండా భాగంలో కూడా స్లాబుపై పెచ్చులు, చుట్టూ గోడలు పెచ్చులు ఊడిపోయి రాడ్ తేలింది. వర్షాకాలం వచ్చిందంటే గ్రంథాలయంలో అక్కడక్కడా కురుస్తోందని పాఠకులు పేర్కొంటున్నారు. ఏ సమయాన గ్రంథాలయం కూలుతుందోనని పాఠకులు భయాందోళన గురవుతున్నారు. నూతన గ్రంథాలయ నిర్మాణానికి గతంలో ప్రభుత్వం రూ.25లక్షలు మంజూరు చేసింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కూడా కొంత స్థలమును కేటాయించారు. ఇంత వరకు కూడా గ్రంథాలయ నిర్మాణానికి శంకుస్థాపన కూడా కాలేదు. దీంతో శిథిలావస్థలో ఉన్న పాత భవనంలో గ్రంథాలయ నిర్వహణ కొనసాగుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పాఠకులు కోరుతున్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

కాల్వశ్రీరాంపూర్, జనవరి 14: మండలంలోని మొట్లపల్లి, మీర్జంపేట గ్రామాల్లో అయోధ్య అక్షింతలను గ్రామస్థులకు రామ భక్తులు ఆదివారం పంపిణీ చేశారు. రాముని చిత్రపటంతో మొట్లపల్లి, మీర్జంపేట, గంగారాం గ్రామాల్లో శోభయాత్ర నిర్వహించారు. పవిత్ర అక్షింతలకు మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో దూపదీప నైవిద్య రాష్ట్ర అధ్యక్షుడు సతీష్‌శర్మ, సర్పంచ్లు గోనె శ్యామ్, పుప్పాల నాగార్జునరావు, ఎంపీటీసీలు గూడెపు జనార్ధన్‌రెడ్డి, బొల్లమల్ల కౌసల్య, శంకర్ ఆర్ఎస్ఎస్ ప్రచార విభాగ్ కన్వీనర్ దుర్గం రాజేష్ గ్రామస్తులు దోమటి రవి, మేకల మల్లేష్, ముద్దసాని సమ్మయ్య, గాదర్ల వెంకటేష్‌గౌడ్, అట్టెపల్లి నరేష్, గాజర్ల శ్రీనివాస్, దొమ్మటి భాస్కర్, సముద్రాల శ్రీనివాస్, మోహన్, రవి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.


అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



వార్షిక లక్ష్యాలను సాధించేలా శ్రమించాలి

- డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్వీకే శ్రీనివాస్


ఓసీపీ-3 క్వారీలో అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీనివాస్

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 14: ఆర్థిక సంవత్సరం ముగియడానికి రెండు నెలల సమయం ఉన్నందున ఆర్జీ-2 ఏరియాకు నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని సాధించేలా శ్రమించాలని సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్వీకే శ్రీనివాస్ ఆర్జీ-2 అధికారులకు సూచించారు. ఆదివారం ఆర్జీ-2 ఏరియాలో ఆయన పర్యటించారు. వకీల్‌పల్లె గని జీవిత కాలం పెంచుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. గని అధికారులతో ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గని పని స్థలాలను పరిశీలించి, కంటిన్యూయస్‌మైనర్, ఎల్‌హెచ్‌డీ యంత్రాల ద్వారా ఉత్పత్తి పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎన్వీకే ప్రసాద్ సూచించారు. ఓసీపీ-3 ఫేజ్-2లో ఓబీ కాంట్రాక్టర్లతో సమావేశమయ్యారు. బొగ్గు అవసరాల దృష్ట్యా ఉత్పత్తికి అంతరాయం లేకుండా ఓబీ తొలగింపు పనులు చేయాలని సూచించారు. వ్యూ పాయింట్ నుంచి ఓసీపీ-3 ప్రాజెక్టు పని స్థలాలను పరిశీలించారు. ఉత్పత్తి పెరిగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు డైరెక్టర్ పలు సూచనలు చేశారు. డైరెక్టర్ వెంట జీఎం సూర్యనారాయణ, పీఓ మధుసూదన్, వీకేపీ గని అఫిషీయేటింగ్ పీఓ రవీందర్, సివిల్ డీజీఎం ధనుంజయ, వీకేపీ గని మేనేజర్ రవికిరణ్, ఎస్ఎస్‌వో షరీఫ్ మహమ్మద్, సేఫ్టీ అధికారి రాంకుమార్ తదితరులు ఉన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు


జీలకుంటలో ముగ్గును పరిశీలిస్తున్న నిర్వాహకులు

ఓదెల, జనవరి 14 : మండలంలోని జీలకుంటలో ఆదివారం భోగి సందర్భంగా షణ్ముఖ అగ్రిటెక్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రంగవల్లుల పోటీలు పలువురిని అలరించాయి. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్ఎం స్వామి మాట్లాడుతూ ఇలాంటి సంప్రదాయకమైన పండుగలకు ముగ్గుల పోటీలు మరింత అందాన్ని తెచ్చిపెట్టాయన్నారు. ప్రతి ఏడాది సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో 25మంది పాల్గొనగా ఇందులో ప్రథమ స్థానం టి.అఖిలకు లభించింది. అలాగే టీ ప్రవళికరెడ్డి ద్వితీయ, ఇ.రాణి తృతీయ మిగతా వారికి ప్రోత్సాహక బహుమతులను సర్పంచ్ పత్తి మాలతీ సమ్మిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఇరుకుల్ల శ్రీనివాస్, సుధాకర్, రామినేని రాజ్ కుమార్, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, జనవరి 14 : మండల కేంద్రంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఛత్రపతి శివాజి యువసేన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజి యువసేన నాయకులు మాట్లాడుతూ పండుగల ప్రాముఖ్యత, విలువల గురించి యువత తెలుసుకోవాల్సి అవసరం ఎంతైనా ఉందన్నారు. ముగ్గుల పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.